క్లుప్తంగా

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరుగుదల

నింద్ర: మండలంలోని రైతులు తమ పొలాల్లో భూసారం పెంచేందుకు పచ్చిరొట్ట ఎరువులను కలియదున్నాలని వ్యవసాయాధికారి తులసిరాం తెలిపారు. ఆయన బుధవారం నింద్రలో రైతులకు జనుము జీలుగ, పిల్లిపెసర సాగుపై అవగాహన కల్పించారు. ఆయన మట్లాడుతూ ప్రతి రైతూ తప్పనిసరిగా పచ్చిరొట్ట విత్తనాలు వేసి భూమిలో కలియదున్నాలని సూచించారు. తద్వారా భూమి సారవంతమై రబీలో సాగు చేసే పంటల నుంచి అధిక దిగుబడి సాధించవచ్చన్నారు.

పోలింగ్‌పై విద్యార్థులకు అవగాహన



మాక్ పోలింగ్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నగరి : స్థానిక బస్టాండు ప్రాంగణంలో ఉన్న నారాయణ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాక్ పోలింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యార్థి నాయకుడిని ఎన్నుకున్నారు. పాఠశాల ఏజీఎం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలు నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కార్తీక్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గర్భిణులు రక్తపరీక్ష చేసుకోవాలి



గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: మండల పరిధిలోని గర్భిణులు నెలనెలా క్రమం తప్పకుండా రక్తపరీక్షలు చేసుకున్న తరువాతనే వైద్యపరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆయన గర్భిణులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేసుకకోవాలని సూచించారు. అనంతర గర్భిణులకు, చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



తులసీప్రసాద్

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలం విద్యుత్ శాఖ ఇంచార్జి ఏఈగా తులసీప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పూతలపట్టు విద్యుత్ కార్యాలయంలో సబ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెనుమూరు మండలానికి ఇంచార్జీ ఏఈగా అదనపు బాధ్యతలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఏఈ తులసీప్రసాద్ మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యల తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించేందుకు కృషిచేస్తానని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని పేర్కొన్నారు.

తారు రోడ్డును బాగుచేయాలని వినతి



వర్షానికి దెబ్బతిన్న తారురోడ్డు

విజయపురం : తమ గ్రామంలోని తారు రోడ్డును బాగుచేయాలని కాళికాపురం గ్రామస్తులు కోరుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి విజయపురం నుంచి నగరికి వెళ్లే రోడ్డు దెబ్బతినిందని పేర్కొంటున్నారు. ఈ రోడ్డు గుండా ప్రతిరోజూ వాహనాలు పెద్దసంఖ్యలో వెళుతుంటాయని, రోడ్డు దెబ్బతినడంతో ప్రమాదాల బారిన పడుతున్నట్టు పేర్కొంటున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి తారు రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

నేటి నుంచి మహాభారత హరికథా గానం

పుత్తూరు: స్థానిక ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నుంచి మహాభారత హరికథా గానం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భాగవతారిణి పి.స్వర్ణలత 18 రోజుల పాటు హరికథా గానం చేస్తారని పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు హరికథా గానం ఉంటుందని వెల్లడించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 16న అలుగు ఉత్సవం, 17న రథోత్సవం, 18న అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నారు.

మెట్ట భూముల్లో పూల గుబాళింపు

- ఒకసారి మొక్కలు నాటితే ఐదేళ్ల వరకు కాపు
- డ్రిప్‌తో తక్కువ నీటి వినియోగం
- ఆదాయం కళ్ల జూస్తున్న రైతులు



మెట్ట ప్రాంతాల్లో సాగులో వున్న రోజా తోట, వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్

పాలసముద్రం: మండలంలో శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో చెరువుముందర కండ్రిగ గ్రామాల్లో మెట్టభూముల్లో ఆధునిక సేద్యంతో రైతులు రోజా, గులాబి, మల్లెపూల తోటలు సాగు చేస్తున్నారు. ఒక్కసారి నాటితే ఐదేళ్లపాటు దిగుబడి వచ్చే రోజాలను డ్రిప్ సౌకర్యంతో సాగు చేస్తూ రోజూ రాబడిని కళ్లజూస్తున్నారు. రోజా సాగుతో పాటు చిక్కుడు, బెండ, మిరప పంటలను కూడా ఇదే తరహాలో సాగు చేస్తున్న చెరువుముందర కండ్రిగ గ్రామానికి చెందిన వడివేల్‌రెడ్డి రైతులకు పూల సాగులో ఆదర్శంగా నిలుస్తున్నాడు. పూల తోట సాగు పద్ధతిపై వడివేల్‌రెడ్డి, వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ వివరించారు.

- **సాగు విధానం..**

ముందుగా భూమిని దుక్కిచేసి పశువుల ఎరువులతో సారవంతం చేసుకోవాలి. భూమిని మెత్తగా చేసుకుని బోదెలు ఏర్పాటు చేయాలి. ఎకరాకు 3 వేల మొక్కలు నాటుకోవాలి. మొక్కల మధ్య 1.5 మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. నీరు ఇంకా తేలికపాటి నేలలు, సూర్యరశ్మి బాగా తగిలే వాతావరణం రోజా మొక్కల పెంపకానికి అనుకూలం. రోజా పూల మొక్కలను ఎప్పుడైనా నాటుకోవచ్చు. ఎండా కాలంలో అయితే నీటి వసతి లేకపోవడం, ఎండల తీవ్రంగా ఉంటాయి. కాబట్టి వర్షాలు పడే సమయం (సెప్టెంబరుర్–అక్టోబర్ మధ్య కాలం)లో నాటుకుంటే మంచిది. చనిపోయిన మెక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటుకోవాలి. ఇందుకు మరో 500 మొక్కలు అవసరం పడతాయి.

- **ఖర్చు–రాబడి..**

చిట్టిగులాబి, రోజా (మినీయేచర్ రకం)మొక్కరూ 20 బెంగళూరు, తమిళనాడు క్రిష్ణగిరి నుంచి తెప్పించాలి. ఎకరాకు మొక్కలకే రూ.60 వేల పెట్టుబడి అయింది. తొలి ఏడాది ఇతర ఖర్చులు మరో రూ.60 వేల వరకు అవుతుంది. తర్వాత సంవత్సరం నుంచి ఎకరాకు రూ.45 వేల ఖర్చు అవుతుంది. ఒక్కసారి నాటుకుంటే ఐదేళ్లపాటు పూల దిగుబడి వస్తుంది. ప్రతిరోజూ 20 నుంచి 30 కేజీల పూల దిగుబడి వస్తుంది. ప్రస్తుత మార్కెట్‌ను బట్టి సగటున రోజుకు రూ.2వేల రాబడి వస్తుంది.



రోజా పూలు

- **యాజమాన్యం విధానం..**

మొక్కల బెట్టకు రాకుండా నాలుగు రోజులకొకసారి నీటిని పెట్టాలి. మెట్ట ప్రాంతం కావడంతో నీటి వసతి తక్కువగా ఉన్నందున నీటి ఆదా కోసం డ్రిప్ సౌకర్యం ద్వారా నీటిని వాడుకోవచ్చు. మొక్కదశ నుంచే సస్యరక్షణ చర్యలు చేయాలి. 20 రోజులకు ఒకసారి 28:28 ఫాస్ఫేట్‌ను వాడాలి.దీని వల్ల మొక్కబాగా పెరుగుతుంది. కలుపు నియంత్రణ చర్యలు తరచూ చేపడు తుండాలి. లేకుంటే కలుపు వల్ల చీడపీడలు ఆశించే అవకాశం ఉంది. రోజా మొక్కలకు వేసిన ఎరువు, నీటిని కూడా కలుపు స్వీకరించడం వల్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. సంవత్సరానికి ఒకసారి కొమ్మ కత్తిరింపులు చేయాలి. చనిపోయిన, ఎండిపోయిన, తెగులు, పురుగు ఆశించిన కొమ్మలను తొలగించాలి. కొత్త చిగుర్ల ఎంత ఎక్కువగా వస్తే పూలు కూడా అంత ఎక్కువగా పూస్తాయి. కొమ్మలను కత్తిరించిన తరువాత ప్రతి మొక్కకు చుట్టూ 8 కేజీల పశువుల ఎరువు వేయాలి. 3 నుంచి 5 కేజీల వేపిపిండి ఎరువు వేసుకోవాలి. నాటిన 5 నెలల తరువాత నుంచి పూల దిగుబడి వస్తుంది. గులాబీలు సగం విచ్చుకున్న తరువాత కోత కోయాలి.

- **సస్య రక్షణకు చర్యలు..**

పురుగులు, పెంకుపురుగు రాత్రి పూట ఆకులను వంకర టింకరగా కొరికి తినేస్తాయి. దీని నివారణకు సాయంత్రం సమయాల్లో మాలాథియాన్‌ను పిచికారీ చేసుకోవాలి. పురుగు ఉధృతి ఎక్కవగా ఉంటే కొరాజియాన్ పిచికారీ చేయాలి. పేను పురుగులు ఈ పురుగు వల్ల ఆకుల కొనలు, మొగ్గలు నల్లగా మారుతాయి. దీని నివారణకు కొరాజియాన్‌ను పిచికారీ చేయాలి.

- **ఎర్రనల్లి..**

వాతావరణం వేడిగా ఉన్నప్పుడు ఎర్రనల్లి ఎక్కవగా ఆశిస్తుంది. దీని వల్ల మొత్తం ఆకులు రాలిపోతాయి. దీని నివారణకు కూడా కొరాజియాన్‌ను పిచికారీ చేయాలి.

- **తెగుళ్ల బూడిద తెగుల నివారణ..**

బూడిద తెగుల సోకినపుడు కార్బండిజం. నల్ల మచ్చలు ఏర్పడినపుడు మాంకోజెబ్ లేదా కార్బండిజం మందులను తగిన మోతాదులో పిచికారీ చేయాలి. ఎండు తెగులు వస్తే ముందుగా కత్తిరించిన కొమ్మనుంచి వస్తుంది. కావున కత్తిరించిన ప్రదేశంలో రాగిధాతు సంబంధమైన మందును పేస్టులాగా పూయాలి. ఈవిధంగా సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్లు, పురుగులను నివారించవచ్చు.

కొనసాగుతున్న పౌష్టికాహారం వితరణ



పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు: పరీక్షల కోసం ఆస్పత్రులకు వచ్చే గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మాజీ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రికి పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. ఇందులో భాగంగా విజిటబుల్ ఫలావ్, వైట్ రైస్, గుడ్డు, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటి పండు పెట్టారు.

ఇళ్ల మధ్య గేదెల షెడ్లు తొలగించాలి



గేదెల షెడ్లను తొలగించాలని ఆదేశిస్తున్న కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి

పుత్తూరు: పట్టణంలోని జనావాసాల మధ్య గేదెల షెడ్లను స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి యజమానులను ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక ఎన్జీవో కాలనీలో ఉన్న గేదెల షెడ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గేదెల వ్యర్థాలను కాల్వల్లో వేయడం ద్వారా చెత్త పేరుకుపోయి కాలనీ మొత్తం దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. దోమలు వృద్ధిచెంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని వివరించారు. ఈ విషయంపై స్థానికుల నుంచి తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. గేదెల షెడ్లను 3 రోజుల వ్యవధిలో పట్టణానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని యజమానులను ఆదేశించారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నగరం రోడ్డు సర్కిల్ వద్ద చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించారు.


వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం



సీతారామలక్ష్మణులకు తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏడాది పొడవునా శ్రీవారికి నిర్వహించే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాల కారణంగా ఆలయ పవిత్రతకు లోపం రాకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఉదయం సీతారామ సమేత లక్ష్మణస్వామి వారి ఉత్సవ మూర్తులను విమాన ప్రదక్షిణగా యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరినీళ్లతో స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులకు అభిషేకం చేశారు. శాత్తుమొర, ఆస్థానం జరిపించారు. సాయంత్రం సీతారామలక్ష్మణులను బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి పవిత్ర ప్రతిష్ట, శయనాధివాసం చేపట్టారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఈఓ నాగరత్న, కంకరణభట్టార్ సీతారామాచార్యులు, సూపరింటెండెంట్ సోమశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్ పాల్గొన్నారు.

వేడుకగా తిరువాడిపుర ఉత్సవం



తిరుచ్చి వాహనంపై ఆండాళ్ అమ్మవారు

నారాయణవనం: స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా బుధవారం సాయంత్రం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన ఆండాల్ అమ్మవారు మాడవీధుల్లో విహరించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. తిరువాడిపుర ఉత్సవాల సందర్భంగా ఆండాళ్(గోదాదేవి)కి అభిషేకం, అర్చనలను చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన అమ్మవారు మాడవీధుల్లో విహరిస్తూ భక్తుల కర్పూర హారతులు అందుకున్నారు. ఆలయానికి చేరుకున్న అమ్మవారికి ఆస్థానం నిర్వహించి, దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. పైకార్యక్రమాలను ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాసభట్టాచార్యులు తదితరులు పర్యవేక్షించారు.

క్లినిక్‌లు నిర్వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న డాక్టర్ దుర్గాదేవి

గంగాధర నెల్లూరు: అనుమతులు లేకుండా ప్రైవేట్ క్లినిక్‌లలో వైద్యం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వైద్యాధికారిణి డాక్టర్ దుర్గాదేవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆమె మాట్లాడుతూ ఆర్ఎంపీ క్లినిక్‌లలో, పలు మందుల షాపుల్లో అనుమతులు లేకుండా వైద్యం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ప్రభావతిదేవి పలు మెడికల్ షాప్‌ల్లో క్లినిక్‌ల పేరుతో వైద్యం చేస్తుండడం గమనించారని, ఎవరైనా అనుమతులు లేకుండా వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుడు గంగయ్య సేవలు ప్రశంసనీయం



గంగయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విజయపురం : ఉపాధ్యాయుడు గంగయ్య సేవలు ప్రశంసనీయమని మండల విద్యాశాఖ అధికారి హరిప్రసాద్‌వర్మ తెలిపారు. విజయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న హరిప్రసాద్‌వర్మ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను మండలంలోని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం శ్యామల మాట్లాడుతూ ఉపాధ్యాయుడు గంగయ్య 28 సంవత్సరాలు విద్యారంగంలో విశిష్ట సేవలు అందించారని తెలిపారు. ఎంతోమంది విద్యార్థుల ఉన్నతికి కారకులయ్యారని పేర్కొన్నారు.

తిరుచ్చిపై శ్రీకృష్ణుని చిద్విలాసం



తిరుచ్చిపై ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారికి అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణస్వామివారు అమ్మవార్లతో కలసి బుధవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మ నక్షత్రం రోహిణిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేదారు చిరంజీవి పాల్గొన్నారు.

రౌడీ మూకలను నియంత్రించండి

- కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి

పుత్తూరు: రౌడీ మూకలను నియంత్రించాలని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు కోరారు. మున్సిపల్ చైర్మన్ ఎ.హరి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరిగిపోతోందని, త్వరలో జరగనున్న ద్రౌపదీదేవి తిరునాళ్లలో రౌడీ మూకలను నియంత్రించాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. పట్టణంలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని, చిన్న పిల్లలు బలైపోతున్నారని వాపోయారు. సచివాలయాల సిబ్బంది ఆయా కౌన్సిలర్లకు జవాబుదారిగా పనిచేయాలని, ఇందుకు తగిన ఆదేశాలు జారీ చేయాలన్నారు. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. దీనిపై చైర్మన్ హరి సమాధానం ఇస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆమోదించిన తీర్మానాలు

- పుత్తూరులో రూ.46.67 లక్షలతో అన్నా క్యాంటీన్ నిర్మాణం
- హెచ్‌పీ పెట్రోల్ బంకు నుంచి చెర్లోపల్లి గ్రామం వరకు రూ.19.61 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- 16వ వార్డులో తహసీల్దార్ కార్యాలయం నుంచి నాగాలమ్మ ఆలయం వరకు రూ.4.95 లక్షలతో సీసీ డ్రైన్
- ఆరేటమ్మ కాలనీ నుంచి వెంకటేశ్వర హాస్పిటల్ వరకు రూ.4.95 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం
- పట్టణ పరిధిలోని మంచినీళ్ల, కుందిమాకుల, వినాయకపురం, నెత్తం గుంటలు, కట్టకింద రామ కృష్ణాపురం, ఈశ్వరాపురం, తాయిమాంబాపురం, నెత్తం, చెర్లోపల్లి, గోవిందపాళెం చెరువులను చేపల పెంపకానికి లీజుకు ఇవ్వడం.

కంటి వ్యాధులతో అప్రమత్తం



రోగులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సురేఖ

వెదురుకుప్పం: వయో వృద్ధులు కంటి వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి సురేఖ అన్నారు. బుధవారం మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులను పరీక్షించారు. ఇందులో 20 మందిని క్యాటరాక్ట్ కేసులుగా గుర్తించి శస్త్రచికిత్స కోసం ఎంపిక చేశారు. మరో 20 మందికి పీహెచ్‌సీలోనే వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సురేఖ మాట్లాడుతూ ఆపరేషన్‌కు ఎంపిక చేసిన రోగులకు అరవింద కంటి ఆస్పత్రిలో వైద్యం అందించనున్నట్లు చెప్పారు. అనంతరం పారామెడికల్ ఆప్తాల్మిక్ అధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ క్రిష్టారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు నీరజ, తనూజ, ఉమాసాగరి, ఏఎన్ఎం డెన్సీ పాల్గొన్నారు.

ఆలయ ఆదాయం రూ.15.50 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలోని కుమారగిరిపై వెలసిన వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల ఆలయ ఆదాయం రూ.15లక్షల 50 వేలు వచ్చినట్లు దేవదాయశాఖ ఈఓ కృష్ణ నాయక్ తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో హుండీలోని కానుకలను లెక్కించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ తలనీలాలు వేలం పాట ద్వారా రూ.లక్షా 25 వేలు, తాత్కాలిక హుండీ ద్వారా రూ. రూ.3లక్షల 16 వేల 771, శాశ్వత హుండీ ద్వారా రూ.64 వేల 775, సేవా టికెట్ల ద్వారా రూ.6 లక్షల 20 వేల 620, దాతల వితరణ ద్వారా రూ.4లక్షల 22వేల 932 ఆలయానికి ఆదాయం వచ్చిందన్నారు. ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి వెచ్చిస్తామన్నారు. ఆలయ మాజీ అధ్యక్షుడు రవియాదవ్, ఏఎస్ఐ మునిక్రిష్ణ పాల్గొన్నారు.

పశువులకు ముందస్తు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యులు

శ్రీరంగరాజపురం: పశువులకు బొబ్బలు రాకుండా ముందస్తు టీకాలు వేసుకోవాలని మండల పశువైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. ఆమె మాట్లాడుతూ మూడు నెలలు పైబడిన లేగదూడ నుంచి అప్పుడే ఈనే పశువుల వరకు టీకాలు వేసుకోవచ్చన్నారు. ప్రతి సచివాలయంలోని రైతు భరోసా కేంద్రంలో టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీ నల్లాపల్లి గ్రామంలో 95 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్ హరిబాబు, ఉమ, పవన్ పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు



బ్యాంక్ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న డీజీఎం

నగరి : వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే బ్యాంక్ ఆఫ్ బరోడా ధ్యేయమని ఆ బ్యాంకు బిజినెస్ డెవలప్‌మెంట్ డీజీఎం ఎంవీఎస్ సుధాకర్ తెలిపారు. ఆయన బుధవారం నగరిలో నూతనంగా ఏర్పాటుచేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏజీఎం, డివిజనల్ హెడ్ పి.అమరనాథ్ రెడ్డి, జీఎం, జోనల్ హెడ్ రితీష్‌కుమార్, డీజీఎం కంప్లెయన్స్, ఇన్సూరెన్స్ కె.సూర్యకుమార్, నగరి బ్రాంచ్ హెడ్ ఆర్.గురుఅశోక్, తిరుపతి రీజియన్ డిప్యూటీ రీజనల్ హెడ్ బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధన అవసరం



విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న ముఖ్యఅతిథులు

తిరుపతి సిటీ : నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే నిరంతరం సాధన అవసరమని అనంతపురం జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు సూచించారు. బుధవారం కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేకి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సుదర్శనరావు మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో యువతకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని, స్కిల్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఏఐటీయూసీ చీఫ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్ మాట్లాడుతూ అధునాతన టెక్నాలజీతో విద్యార్థులకు నాణ్యమైన విద్య, కోర్సులను ఏఐటీయూసీ అందిస్తోందని తెలిపారు. ప్రపంచంలోనే మన దేశ విద్యార్థులకు ప్రత్యేక గౌరవం ఉందన్నారు. కళాశాల చైర్మన్, వైస్ చైర్మన్ గంగిరెడ్డి, ప్రకాష్ మాట్లాడుతూ ఎస్వీసీఈ కళాశాల విద్యార్థులు దేశవిదేశాలలో రాణిస్తున్నారని వెల్లడించారు. దేశంలోనే ఎస్వీసీఈ టాప్ వంద కళాశాలల్లో ఒకటిగా చోటు దక్కించుకోవడం గర్వంగా ఉందన్నారు. అనంతరం 850 మంది బీటెక్ పూర్తి చేసి విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. వీరిలో ఏడుగురు విద్యార్థులు గోల్డ్‌మెడల్ అందుకోవడం విశేషం. కార్యక్రమంలో కలికిరి జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు, ఎస్వీసీఈ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని సరస్వతికండ్రిగలో ఓ బాలిక అదృశ్యంపై కేసు నమోదైనట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు బుధవారం రాత్రి తెలిపారు. సరస్వతికండ్రిగ గ్రామానికి చెందిన (16) బాలిక మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి, నిద్రించింది. బుధవారం ఉదయం బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

పామాయిల్ సాగుతో అధిక లాభాలు



మాట్లాడుతున్న పుష్పలత

ఏర్పేడు: పామాయిల్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానవన శాఖ శ్రీకాళహస్తి డివిజన్ అధికారి పుష్పలత అన్నారు. బుధవారం మండలంలోని ముసలిపేడులో పామాయిల్ తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తోటల పెంపకానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని ఉద్యానవన శాఖ చెల్లిస్తుందన్నారు. ఒక మొక్క ధర రూ.193 ఉంటుందన్నారు. ఎకరాకి 57 మొక్కలు, ఒక హెక్టారుకు 143 మొక్కలు మాత్రమే నాటాలన్నారు. మూడేళ్లకు పంట దిగుబడి ప్రారంభమై, 30 సంవత్సరాల వరకు వస్తుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ రాజేష్, క్లస్టర్ అధికారి గురునాథం పాల్గొన్నారు.